క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఎవరికైనా కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిసే వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని వివరించారు. జిల్లా కలెక్టర్, అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

తుర్కయంజాల్: దేశంలో ఆర్థిక అసమానతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, సామాజిక అభివృద్ధి కుంటుపడి పోతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ మున్సిపాలిటీ రెండో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసమానతలు లేని సమాజం కోసం పుట్టిందే ఎర్రజెండా అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, దేశంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేశాలతో చిచ్చు పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, కావలి నర్సింహ, పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక



అవార్డు అందుకుంటున్న శివకృష్ణగౌడ్

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇండియా షోటోఖాన్ కరాటే మాస్టర్ శివకృష్ణగౌడ్ నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఆదివారం ఏపీలోని విజయవాడ నగరంలో వైఎంకే అకాడమి ఆధ్వర్యంలో గుజ్జల సరళదేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. వైఎంకే అకాడమి మాస్టర్ రూపస్‌పాల్ సినీహీరో భానుచందర్ చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకున్నట్లు శివకృష్ణగౌడ్ తెలిపారు.

ఘనంగా బ్రూస్‌లీ వర్ధంతి



వర్ధంతి కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, విద్యార్థులు

కొందుర్గు: న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బ్రూస్‌లీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి, బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాస్టర్ రమేశ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బ్రూస్‌లీ లెజెండ్‌గా నిలిచాడన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు రాజు, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లు సభను విజయవంతం చేయండి

మొయినాబాద్: ఆమనగల్లులో సోమవారం జరిగే దివ్యాంగులు, వితంతు, చేనేత పింఛన్‌దారుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మాసానిపేట యాదగిరిమాదిగ కోరారు. ఆదివారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాలు, అన్ని గ్రామాల నుంచి దివ్యాంగులు, వితంతువులు, చేనేత పింఛన్‌దారులంతా తరలిరావాలన్నారు. పింఛన్‌దారుల సమస్యల పరిష్కారంకోసం జరుగుతున్న సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్‌మాదిగ, నాయకులు శివ మాదిగ, సురేష్ తదితరులు ఉన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి



ప్రాజెక్టు వద్ద పర్యాటకులు

కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. యువతీ, యువకులతో పాటు కుటుంబాలతో ప్రాజెక్టుకు చేరుకుని గంటల తరబడి సేదతీరారు. చిన్నా పెద్దా తేడా లేకుండా నీటిలో గంతులేసి ఆనందంగా గడిపారు. అనంతరం బోటింగ్ చేస్తూ సెల్ఫీలు దిగుతూ ఫొటోలకు ఫోజులిచ్చారు. ప్రాజెక్టు ప్రాంతం పర్యాటకులతో కళకళలాడింది. మేఘాలు కమ్ముకోవడంతో పచ్చని అడవి అందాలను చూస్తూ పర్యాటకులు నది ఒడ్డున కూర్చుని వాతావరణాన్ని ఆశ్వాదించారు. – ధారూరు



ప్రాజెక్టు వద్ద చిన్నారిని ఫొటో తీస్తున్న పర్యాటకుడు

అధ్వానం.. మద్వాపూర్ రోడ్డు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: పల్లెలు బాగుంటే.. గ్రామాలు బాగుంటాయి. కానీ నేడు ఆయా గ్రామాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజురోజుకు గ్రామాల్లోని మట్టిరోడ్లు కొన్ని అధ్వానంగా తయారవుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు.
ఈ రహదారులపై ప్రయాణం చేసే వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ చాలా కాలంగా ఈ విషయం పంచాయతీరాజ్ అధికారులకు తెలిసినా తమకేమీ సంబంధం లేదనట్టుగా వ్యవహరిస్తున్నారు. బంట్వారం మండల పరిధిలోని మద్వాపూర్ గ్రామంలోని మట్టి రోడ్డు కోట్‌పల్లి వరకు వెళ్తుంది. పంచాయతీరాజ్ పరిధిలోని ఈ రహదారి సుమారు 4 కిలో మీటర్ల మేర ఉంటుంది. ఇది లింకు రోడ్డు కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ వైపుగానే వెళ్తుంటారు. సల్బత్తాపూర్ మీదుగా వెళ్తే దూరం ఎక్కువవుతుందని మద్వాపూర్ వాసులు కోట్‌పల్లి నుంచే ప్రయాణిస్తున్నారు. వర్షాకాలంలో మాత్రం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. కాలినడక కూడా కష్టమే. ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత జరుగుతుండడంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా కాలినడకనే వెళ్తుంటారు. కనీసం మెటల్ రోడ్డు వేసినా బాగుండేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈ జితేందర్‌ను సంప్రదించగా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.



బంట్వారం: మద్వాపూర్-కోట్‌పల్లి రోడ్డు దుస్థితి



ధారూరు: కల్వర్టుపై ఏర్పడిన గుంతలు

మరమ్మతులు చేయించండి

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టుకు రావాలంటే ఏ రోడ్డు ఎలా ఉందో అర్థం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం సేద తీరడానికి, ప్రకృతి వాతావరణాన్ని ఆనందించడానికి రావాలంటే ఈ రోడ్డు గుంతలతో ధారుణంగా తయారైందని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి రుద్రారం గ్రామ సమీప రోడ్డుపై నిర్మించిన కల్వర్టు వద్ద పెద్దపెద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ దారిగుండా వెళితే తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్టు నుంచి ప్రయాణించినప్పుడు దగ్గరకువచ్చిన తర్వాతే గుంతలు కన్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనాలను తాము అదుపుచేయలేక కిందపడుతున్నామని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రాజెక్టు వచ్చి వెళ్లాలంటే కష్టంగా ఉంటుందని పేర్కొంటున్నారు. సత్వరమే ఆర్అండ్‌బీ అధికారులుఅ స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



మద్వాపూర్ నుంచి కోట్‌పల్లికి వెళ్లే మట్టి రోడ్డును బాగు చేయాలి. వర్షాకాలం కాలి నడక కూడా వెళ్లలేని దుస్థితి ఉంటుంది. కనీసం కంకర రోడ్డు వేయించి అందరికి సౌకర్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. దీని కోసం నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు చేపట్టాలి. ఈ రోడ్డును బాగు చేస్తే కోట్‌పల్లికి తక్కువ సమయంలోనే చేరుకునే అవకాశం ఉంటుంది. రద్దీ దృష్ట్యా సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.
–నరేశ్, స్థానికుడు, మద్వాపూర్

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని కుల్కచర్ల, చాపలగూడెం, తిర్మలాపూర్, లాల్‌సింగ్ తండా, రాంపూర్, కుస్మసముద్రం, అనంతసాగర్ తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాంపూర్, సాల్వీడు గ్రామాల్లోని చెంచు కాలనీలలో రూ. 50లక్షలతో మల్టీపర్పస్ భవనాలను నిర్మించేందుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిగి నియోజకవర్గ పరిధిలో 3,500మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. ప్రతీ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5,143మందికి నూతన రేషన్‌కార్డులను అందజేశామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని దశల వారీగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ సత్యమ్మ, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు పి.వెంకటయ్య, నాయకులు కుమ్మరి స్వామి, లక్ష్మయ్య, కృష్ణయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



చెంచుకాలనీలో మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కులం పేరుతో దూషించిన వారిని శిక్షించాలి

- సీఐటీయూ, దళిత, ప్రజాసంఘాల డిమాండ్
- 4న ఎస్పీ కార్యాలయం ముట్టడి

తాండూరు టౌన్: ఎరుకల కుటుంబంపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వారిని అరెస్టు చేయాలని దళిత, ప్రజా, సీఐటీయూ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు మండలం చెన్‌గేష్ పూర్ గ్రామానికి చెందిన ఎరుకలి శారద, బస్వరాజ్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన రమేశ్ గౌడ్, నరేందర్ గౌడ్, నాని గౌడ్, నరేష్ గౌడ్, పవన్ గౌడ్‌లు అకారణంగా గత నెలలో దాడి చేశారని పేర్కొన్నారు. ఈ విషయం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. లేని ఎడల రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తమ పోరాటంలో భాగంగా ఈ నెల 4వ తేదీన ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దళిత, ప్రజాసంఘాల నాయకులు కె శ్రీనివాస్, చంద్రయ్య, నరేశ్, నవీన్ తదితరులు తెలిపారు.



మాట్లాడుతున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

పాఠశాలకు బెంచీల వితరణ

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌లోని ఓ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంచీలను ఆదివారం అందించారు. సికింద్రాబాద్ జూనియర్ ఛాంబర్స్ చారిటబుల్ ట్రస్ట్ బెంచీ మార్క్ త్రీ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలకు చైర్మన్ నాగశ్రీధర్ 40 బెంచీలను అందజేశారు. విద్యాభివృద్ధికి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మాజీ చైర్మన్ కమలాకర్ ముత్యాలు, ప్రధానోపాధ్యాయులు చక్రధర్‌రావు, మల్లికార్జున్, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నప్ప, రాజకుమార్ రెడ్డి, రవికుమార్, లావణ్య, కవిత, వినీత్ తదితరులు పాల్గొన్నారు.



బెంచీలను అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

'చలో గన్‌పార్క్'కు తరలిరండి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని నిర్వహిస్తున్న చలో గన్ పార్క్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22న ఉద్యమకారుల ఫోరం చల్ గన్ పార్క్ మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో అమరుడు యాదిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.


కుక్కల దాడిలో మేకల మృతి

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో నాలుగు మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కురువ మల్లేశ్ మేకల పోషణతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజు మాదిరిగా మేకలను శనివారం రాత్రి తన వ్యవసాయ పొలంలోని కొట్టాంలో ఉంచి ఇంటికి మల్లేశ్ వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం మంద వద్దకు వెళ్లి చూడగా కుక్కలు దాడి చేసి నాలుగు మేకలను చంపేసినట్లు గుర్తించి గ్రామస్తులకు తెలియజేశాడు. మేకల విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తనని ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఉండలేం.. వచ్చేస్తాం!

జైళ్లను తలపిస్తున్న కార్పొరేట్ కాలేజీ హాస్టళ్లు

- కరువైన మౌలిక వసతులు
- విరామం లేకుండా తరగతులు
- ఒత్తిడి తట్టుకోలేకపోతున్న విద్యార్థులు
- ఇళ్లకు వచ్చేస్తామంటూ తల్లిదండ్రులకు వేడుకోలు
- కొరవడిన ప్రభుత్వ నియంత్రణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కార్పొరేట్ జూనియర్ కాలేజీ వసతి గృహాలు చెరసాలలను తలపిస్తున్నాయి. ఉదయం నిద్ర లేచింది మొదలు.. విరామం లేకుండా తరగతులు నిర్వహిస్తుండటం.. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా సమయం లేకపోతుండటంతో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. ఉండలేం.. వచ్చేస్తామంటూ భోరుమంటున్నారు. ఇంటర్మీడియెట్‌లో మెరుగైన ఫలితాలు, పోటీ పరీక్షల్లో ర్యాంకుల సాధన కోసం చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్‌కాలేజీ వసతి గృహాల్లో చేర్పిస్తున్నారు. పిల్లల శక్తిసామర్థ్యాలు, ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా చేర్పిస్తుండటంతో చేరిన కొద్ది రోజులకే అక్కడ తాము చదవలేమని.. తిరిగి ఇంటికి తీసుకెళ్లిపోవాలని తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. కొంతమంది ఏమీ తినకుండా కడుపుమాడ్చుకుని నీరసంతో ఆస్పత్రుల్లో చేరుతుండగా.. మరికొంత మంది ఏకంగా బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. అప్పటికే సగానికిపైగా ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు చేసేది లేక.. పిల్లలకు సర్దిచెబుతున్నారు.

లేచింది మొదలు ఉరుకులు పరుగులు

జిల్లాలో 17 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా, మరో 214 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో రెండు వేల నుంచి మూడు వేల మంది పిల్లలు చదువుతున్నారు. ఒక్కో గదిలో ఆరు నుంచి ఎనిమిది మందిని ఉంచుతున్నారు. వీరందరికీ ఒక్కటే మూత్రశాల, మరుగుదొడ్డి, స్నానాల గది ఉండటంతో ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి బాత్‌రూమ్‌ల ముందు క్యూ కడుతున్నారు. మరోవైపు ఇంటర్మీడియెట్ సబ్జెక్టును త్వరగా పూర్తి చేసి, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. నిత్యం ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు క్లాసులు జరుగుతుంటాయి. అల్పాహారం..మధ్యాహ్న భోజనం కోసం గంటన్నర మినహా ఇతర సమయంలో విరామం అంటూ లేకుండా పోతోంది. రాత్రి 11 తర్వాతే నిద్రపోవాల్సి వస్తోంది. కంటికి కునుకులేక, క్లాసులో లెక్చరర్ చెప్పింది అర్థం కాక, భోజనం నాసీరకంగా ఉండటంతో తరచూ అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

చిన్నతనంలోనే పెద్ద జబ్బులు

సాధారణంగా ఎదిగే వయసులో ఉన్న పిల్లలకు కనీస వ్యాయామం అవసరం. కానీ వసతి గృహాల్లో చదువుకుంటున్న వారికి ఆ సమయమే దొరకడం లేదు. చాలామంది పిల్లలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. రోజుకు పదహారు గంటల పాటు కూర్చోవాల్సి వస్తుండటం, కంటికి నిద్రలేకపోవడం, శరీరానికి కనీస వ్యాయామం లేకపోవడంతో చిన్నతనంలోనే ఒత్తిడికి గురవడంతోపాటు ఊబకాయులుగా మారుతున్నారు. నిజానికి ప్రతి కాలేజీలో మానసిక నిపుణులను నియమించాల్సిఉన్నా.. ఎక్కడా పాటించడం లేదు. కౌన్సెలింగ్ నిర్వహించే వాళ్లు లేకపోవడంతో ప్రతి చిన్న విషయానికి మానసికంగా కుంగిపోతూ చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

అద్దెభవనాలు.. అరకొర వసతులు

మెజార్టీ కాలేజీలు అపార్ట్‌మెంట్లలోనే కొనసాగుతున్నాయి. కనీసం ఫైర్‌సేఫ్టీ కూడా లేని బహుళ అంతస్తుల భవనాలను అద్దెకు తీసుకుని వసతితో పాటు తరగతులు నిర్వహిస్తున్నారు. నిజానికి వీటిలో తరగతుల నిర్వహణకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. వసతి గృహాల నిర్వహణకు అనుమతులు లేవు. అయినా ఆయా భవనాల్లో తాత్కాలికంగా చిన్నచిన్న గదులను ఏర్పాటు చేసి ఒక్కో గదిలో ఎక్కువ మంది విద్యార్థులను కుక్కేస్తున్నారు. ఏడాదికి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. కార్పొరేట్ యాజమాన్యాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పరోక్షంగా వాటికి కొమ్ము కాస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అలవాటుపడలేక..



అప్పటి వరకు సాధారణ పాఠశాలలో చదువుకున్న పిల్లలను ఒకేసారి కార్పొరేట్ కాలేజీ హాస్టళ్లలో చేర్పించడంతో ఆ వాతావరణానికి ఇబ్బంది పడుతున్నారు. విరామం లేకుండా తరగతుల నిర్వహణతో మరింత ఒత్తిడికి లోనవుతున్నారు. పిల్లల మానసిక పరిస్థితిని తల్లిదండ్రులతో పాటు లెక్చరర్లు అర్థం చేసుకోవాలి. వారికి నచ్చజెప్పి ఇష్టంగా చదివే విధంగా తయారు చేయాలి.
– డాక్టర్ నాగేందర్, మహేశ్వరం మెడికల్ కాలేజీ

యజుర్వేద పారాయణ కరపత్రాల ఆవిష్కరణ



చౌదరిగూడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్య సమాజం సభ్యులు

కొందుర్గు: చౌదరిగూడ ఆర్య సమాజంలో శ్రావణ మాసంలో నిర్వహించనున్న యజుర్వేద పారాయణ యజ్ఞం కరపత్రాలను సభ్యులు ఆదివారం విడుదల చేశారు. సమాజహితం కోసం గత 45 ఏళ్లుగా ఆర్య సమాజం ఆధ్వర్యంలో యజుర్వేద పారాయణ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఆగస్టు 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు యజ్ఞం చేపడుతున్నామని సంఘం ప్రతినిధి మచ్చ సుధాకర్‌రావు వివరించారు. యజ్ఞబ్రహ్మలుగా అరవింద్‌శాస్త్రీ, వసుదాశాస్త్రీలు వ్యవహరిస్తారని, ఆకారపు సుమతమ్మ, యాదగిరి దంపతులు భక్తులకు భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం ఎన్నిక

కందుకూరు: బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను నూతన కమిటీకి అందజేశారు. అధ్యక్షుడిగా బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, దేరంగుల శ్రీరాములు, శ్రీనివాస్‌గౌడ్, బొడ్డుపల్లి రవి, ప్రధాన కార్యదర్శులుగా జంగయ్య ముదిరాజ్, బాల్‌రాజ్, దామోదర్‌గౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా శేఖర్‌గౌడ్, కాళిదాసుచారి, బాబు, మహేందర్, శ్రీనివాస్‌చారి, ఎ.రమేష్‌గౌడ్, బి.రమేష్‌గౌడ్, నర్సింహ, ఎగ్గిడి కృష్ణ, నరేష్, వెంకటేశ్, జంగయ్య, రామకృష్ణ యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, సురేందర్, ప్రచార కార్యదర్శులుగా వెంకటేశ్ గౌడ్, యాదయ్య ముదిరాజ్, లింగం యాదవ్, యాద య్య, సీహెచ్ రవీందర్, అందె జైపాల్, బండ శ్రీను, మల్లేశ్, శంకర్, నర్సింహ, శివశంకర్, వరికుప్పల రాజు, ఢిల్లీ కృష్ణ, జగదీష్, సలహాదారులుగా బి.వెంకటేశ్, దేవేందర్, ఎస్.అంజయ్య, పి.వెంకటేశ్, ఎమ్మ అంజయ్య కుర్మలను నియమించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య